క్లుప్తంగా

డీఈగా జీవన్‌కుమార్



జీవన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

భద్రాచలంఅర్బన్: విద్యుత్ శాఖ భద్రాచలం డీఈగా జీవన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన మణుగూరు ఏడీఈగా పనిచేస్తూనే భద్రాచలం ఇన్‌చార్జ్ డీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతలోనే ఆయనకు పదోన్నతి లభించగా భద్రాచలంలో పోస్టింగ్ లభించింది. ఈ సందర్భంగా సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని విధుల్లో చేరగా.. ఏడీఈ వేణు, ఏఈలు రాజారావు, ఉపేందర్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

షరీఫ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



షరీఫ్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలంకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ షరీఫ్ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సమాచార, పౌరసంబంధాల శాఖ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గృహజ్యోతి విభాగం నుంచి అవార్డుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవార్డు అందచేయగా పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

ఏటీఏ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో సోమవారం జరిగిన ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీ నానమాద్రి సత్యనారాయణను జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ ఆదివాసీ సమాజ ఉద్యమ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో రేసు వెంకటేశ్వర్లు, తెల్లం శ్రీనివాసరావు, కలం సత్యనారాయణ, బక్కయ్య, సీతారామమ్మ, సోడి శ్రీదేవి, కాక శ్రీదేవి, చవలం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

భద్రాచలంఅర్బన్: ఈనెల 16న హైదరాబాద్‌లో న్యాయవాది సంతోష్ విషయమై పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా భద్రాచలానికి చెందిన న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసాచారితో పాటు ఎంవీ రమణ, విద్యాధరి, బందారు రమేష్, కొడాలి శ్రీనివాసన్, అంబేద్కర్, అవులూరి సత్యనారాయణ, ప్రకాష్, అరుంచంద్, మల్లేష్, మాధవి, కొలిచలం, సున్నం రమేష్, రామకృష్ణ, ప్రవీణ్, గౌతమ్, రవితేజ, పేరాల వెంకటేశ్వర్లు లలిత, రవితేజ, రాంబాబు పాల్గొన్నారు.

సోలార్ లైట్లు పంపిణీ



గద్దమడుగు గ్రామస్తులకు సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం: మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన గద్దమడుగులోని ఆదివాసీలకు పోలీసుల ఆధ్వర్యంలో సోలార్ లైట్లు, వాలీబాల్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఐ అశోక్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఎస్ఐలు వెంకటప్పయ్య, పోటు గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీపల్లిలో వైద్య శిబిరం

చర్ల: మండలంలోని జీపీపల్లిలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు తీవ్రంగా ఉండడంతో పాటు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి జ్వరంతో మృతి చెందడంతో చర్ల ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కాంత్ నేతృత్వంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 66 మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. వారి రక్త నమూనాలు తీసుకున్నారు. ర్యాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ దర్మారావు, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఏఎన్ఎం జోగమ్మ, స్వరాజ్యలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా జీపీ భవనాలు

- నేడు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా ప్రారంభం
- మిగిలినవి పూర్తయితే తిప్పలు తప్పినట్లే..



మంత్రి ప్రారంభించనున్న వినాయకపురం పంచాయతీ భవనం

అశ్వారావుపేటరూరల్: పలు గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు నూతన భవనాలు సమకూరనున్నాయి. పూర్తైన భవనాలు అందుబాటులోకి రాగా, వాటిలో రెండు భవనాలను నేడు(మంగళవారం) రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, నారాయణపురం, మల్లాయిగూడెం, రామన్నగూడెం, కన్నాయిగూడెం, పాత అల్లిగూడెం, మద్దికొండ, తిరుమలకుంట పంచాయతీకు భవనాలు మంజూరు అయ్యాయి. మొత్తం 10 భవనాలు మంజూరు కాగా, వీటిలో తిరుమలకుంట పంచాయతీలో స్థలం లేక నిర్మాణాన్ని చేపట్టలేదు.

మిగిలిన తొమ్మిది భవనాల్లో వినాయకపురం, నారాయణపురం, మల్లాయిగూడెం, రామన్నగూడెం పంచాయతీ భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మరో నాలుగు భవనాలు ఇంకా నిర్మాణాల దశలోనే ఉన్నాయి. అలాగే ఐటీడీఏ ద్వారా మరో ఎనిమిది భవనాలు మంజూరు కాగా, వీటిలో ఒక్క భవనం కూడా ఇప్పటిదాకా పూర్తికాలేదు. ఆయా భవనాలన్నీ గడిచిన ఏడాదిన్నర కాలంగా ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఒకొక్క భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

మంత్రి చేతుల మీదుగా రెండు భవనాలు..

రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం అశ్వారావుపేట మండలంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని వినాయకపురం, నారాయణపురం గ్రామ పంచాయతీ భవనాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవాలకు సంబంధిత అధికారులు అంతా సిద్ధం చేసే పనుల్లో నిమగ్నం అయ్యారు. కాగా, మిగిలిన భవనాల నిర్మాణాలను కూడా త్వరతరగతిన పూర్తి చేస్తే పంచాయతీలకు భవనాల అవస్థలు తప్పుతాయి. వాటిని త్వరగా పూర్తి చేసేలా మంత్రి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీల్లో డీపీఓ సందర్శన



వినాయకపురంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీపీఓ, డీఎల్‌పీఓలు

మండలంలోని వినాయకపురం, నారాయణపురం గ్రామ పంచాయతీల్లో సోమవారం డీపీఓ చంద్రమౌళి పర్యటించారు. ముందుగా ఆయా గ్రామ పంచాయతీల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే పంచాయతీ భవనాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని, ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, చెత్తచెదారాన్ని లేకుండా చూడాలని సిబ్బందిను ఆదేశించారు. డీఎల్‌పీఓ రమణారావు, ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీఓ సోయం ప్రసాదరావు, కార్యదర్శులు సాయి, కార్తీక్, బి.మహేశ్వరి, సిబ్బంది వేల్పుల ముత్తారావు, మనోహర్, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

కిటకిటలాడిన బస్టాండ్లు



భద్రాచలంటౌన్: ఓ బస్సు వద్ద రద్దీ



మణుగూరుటౌన్: ఆర్టీసీ బస్టాండ్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

మణుగూరుటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం మణుగూరు సురక్షా బస్టాండ్ కిటకిటలాడింది. సోదరులకు రాఖీలు కట్టేందుకు మెట్టినింటి నుంచి పుట్టినింటికి వచ్చిన మహిళలు సోదరులకు రాఖీ కట్టి తిరుగుప్రయాణం కావడంతో సురక్షా బస్టాండ్ కిటకిటలాడింది. కొత్తగూడెం రూట్‌లో నాలుగు బస్సులు, భద్రాచలం వైపు 8 ట్రిప్పులు అదనంగా నడిపి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రయత్నించామని, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఆదివారం హైదరాబాద్‌కి రాత్రి డీలక్స్ బస్సులు ఏర్పాటు చేశామని డిపో మెనేజర్ శ్యాం తెలిపారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండడంతో సోమవారం భారీగా రద్దీ ఏర్పడింది. ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు సోదరీమణులు భారీగా ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చారు. రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది మహిళలు బస్టాండ్ ఇన్ గేట్ వరకు వచ్చి బస్సులు వచ్చిన వెంటనే ప్రమాదకంగా బస్సుల వెంట పరుగులు తీశారు. బస్సుల నుంచి దిగకుండా ఎక్కేవారు అడ్డు పడడంతో దిగే ప్రయాణికులు ఆసహనం వ్యక్తం చేశారు.

శాకాంబరిగా అమ్మవారు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీలో ఉన్న పంచముఖ వేదగాయాత్రిదేవీ ఆలయంలో అమ్మవారు సోమవారం శ్రావణపూర్ణిమ సందర్భంగా శాఖాంబరి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దయానిధి అక్కినేపల్లి వసంతాచార్యులు, అర్చకులు అక్కినేపల్లి ప్రదీప్‌శాస్త్రీలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వెస్ మాండే దాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. దాగురే కృషి ఫలితంగా గడిచిన క్షణాలను ఫొటో రూపంలో అందమైన జ్ఞాపకాలుగా దాచుకోగలుగుతున్నామని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: లూయిస్ దాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



దుమ్ముగూడెం: లూయిస్ దాగురే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఫొటోగ్రాఫర్లు



కరకగూడెం: మృతిచెందిన ఫొటో గ్రాఫర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం..



భద్రాచలంటౌన్: వేడుకల్లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు



బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో ఫొటోగ్రాఫర్ పిల్లలకు చెక్కు ఇస్తున్న దృశ్యం



ములకలపల్లి: వేడుకలో అసోసియేషన్ సభ్యులు

స్పాట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం..

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఖాళీల ప్రవేశాల కోసం ఈ నెల 21 వ తారీకు ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగనున్నాయని ప్రిన్సిపాల్ చైతన్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతిలో 13 ఖాళీలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ హెచ్ఈసీలో 16, సీఈసీలో 9 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని కోరారు.

23న పెన్షన్ అదాలత్

మణుగూరుటౌన్: కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించే పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ సోమవారం తెలిపారు. శుక్రవారం పీవీకాలనీ కమ్యూనిటీహాల్‌లో అదాలత్ ఏర్పాటు చేయనున్నామని, మణుగూరు ఏరియాలో సింగరేణి కాలరీస్‌లో పనిచేసిన మాజీ సింగరేణియులు.. పెన్షన్‌కు సంబంధించిన సమస్యలను ఇక్కడ పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

రహదారిపై మద్యం సీసాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట–తుమ్మలచెరువు రహదారిపై మందుబాబులు రహదారి వెంబడి మద్యం సేవించి సీసాలు పగులగొట్టి రహదారిపైనే పడేస్తున్నారు. అవి రోడ్డుపై ప్రమాదకరంగా ఉంటున్నాయి. ఆకతాయిలు మద్యంతోపాటు గంజాయి కూడా తాగుతున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పండ్లు, బ్రెడ్లు అందజేత

మణుగూరురూరల్: సామాజిక సేవకుడు బుద్ధరాజు నవీన్‌బాబు పుట్టినరోజు వేడుకలను నవీన్‌బాబు ఆర్మీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అమ్మనాన్న వృద్ధాశ్రమం, అశ్వాపురం ఆరీఫాఅండ్ రోషిణి వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. నవీన్‌బాబు ఆర్మీ సభ్యులు వల్లభనేని రమణ, సాంబశివరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని ఎర్రబోరు గ్రామానికి చెందిన ముర్రం లక్ష్మి ఇళ్లు విద్యుత్ షార్ట్‌షర్క్యూట్‌తో దగ్ధమై సర్వస్వం కోల్పోగా.. బాధిత కుటుంబానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వితరణ అందజేశారు. అలాగే గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లక్ష్మి కుటుంబం ఉండడానికి రేకుల షెడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరమచినేని వినిల్,మాజీ మండల అధ్యక్షులు లంక అబ్బులు, నాయకులు కేల్ల శేఖర్,తెల్లం హరికృష్ణ, లంక సంపత్, కారం నవీన్ పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో 13 యేళ్లుగా ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య సేవలు అభినందనీయమని రాహూల్ విజ్ఞాన్ విద్యాలయం ప్రిన్సిపాల్ జి.వర్మరాజు పేర్కొన్నారు. రాహూల్ విజ్ఞాన్ విద్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల 13వ వార్షికోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. వైద్యశాల ఏడీఎం దేవి చంద్రశేఖర్, వీసీసీ సాయి తేజ, వీటీ కావ్యశ్రీ, రఘు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు

అక్కా తమ్ముళ్ల అనురాగానికి, అన్నా చెల్లెల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్ని ప్రాంతాల్లో పండుగ వాతావరణం కనిపించింది. సోదరిమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. ఒకరికొకరు తోడుగా, అండగా ఉంటామని భరోసా ఇచ్చిపుచ్చుకున్నారు. రాఖీ కట్టిన సోదరిమణులకు సోదరులు కానుకలు అందించారు. రాఖీ కొనుగోళ్లకు వచ్చిన మహిళలతో విక్రయ కేంద్రాల వద్ద కొలహాలం.. తోబుట్టువుల రాకతో గ్రామాల్లో సందడి కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: మామిళ్లవారిగూడెంలో తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్కలు



ములకలపల్లి: శిశుమందిర్‌లో రాఖీలు కడుతున్న చిన్నారులు



అశ్వాపురం: చెట్టుకు రాఖీ కడుతున్న మాజీ ఎంపీటీసీ కమటం నరేష్



బూర్గంపాడులో రక్షాబంధన్ వేడుక..



కరకగూడెం: రాఖీ కడుతున్న సోదరి



దుమ్ముగూడెం: తమ్ముడికి రాఖీ కడుతూ..

రుణమాఫీకి దరఖాస్తు చేయాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రైతు రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఏఓ పి.శివరాం ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ అవ్వని రైతుల కోసం అశ్వారావుపేట రైతు వేదిక ఆవరణలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని, రైతులు గమనించి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంకు ఖాత జిరాక్స్‌ను జతచేసి అందించాలని ఆయన సూచించారు.

గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోండి

చర్ల: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ వర్తించని రైతులు ఈ నెల 20 నుంచి 30 వరకు నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏఈఓ అఫ్రీద్ తెలిపారు. 20వ తేదీ నుంచి 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల మధ్యలో సంబంధిత రైతులు నిర్ణీత దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రైతు కుటుంబ సభ్యులందరి రేషన్ కార్డుల జిరాక్సులను గ్రీవెన్స్‌లో అందజేయాలని కోరారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా 21న బంద్

చర్ల: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 21న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర నాయకుడు తడికల లాలయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని చర్లలో గల సంత మార్కెట్ సముదాయంలో మాలమహానాడు మండల గౌరవ అధ్యక్షుడు మోతుకూరి ప్రభాకర్ అధ్యక్షతన జరిగి సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టులను కేంద్రంలోని బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ తప్పుదోవ పట్టించి వర్గీకరణకు అనుకూలంగా తీర్పును చెప్పించారని విమర్శించారు. 21న చర్ల మండలంలో బంద్ పాటించాలని, ఇందుకు వ్యాపార, వాణిజ్య, విద్యా, రవాణా తదితక అన్ని విభాగాలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు తోటమల్ల రమణమూర్తి, ఎడెల్ల గణపతి, సీనియర్ నాయకులు దొడ్డి ప్రభుదాసు, కొంగూరు రమణారావు, కొంగూరు నర్సింహారావు నిట్టా అబ్బులు, మైపా జోగారావు, మైసా ప్రభుదాసు, తోటమళ్ల రవికుమార్ కొంగూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి ఘన సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పీకేఓసీ సంక్షేమ అధికారిగా పని చేసి శ్రీరాంపూర్‌కు బదిలీపై వెళ్తున్న సీనియర్ పీఓ మధార్ సాహెబ్‌ను అధికారులు, సహోద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, మాజీ కార్మికులు సోమవారం సంతోష్‌నగర్ బాలవెలుగు పాఠశాల ఆవరణలో పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీకేఓసీ పీఓ, సీఎంఓఏఐ అధ్యక్షుడు టి.లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ.. కార్మిక సమస్యల పరిష్కారంలో కార్మికులకు, యాజమాన్యానికి వారధిగా మధార్ సాహెబ్ కృషిని కొనియాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీకేఓసీ రక్షణ అధికారి మేరుగు లింగబాబు, సంక్షేమ అధికారి ఓంకారిబాబు, సింగరేణి సేవాసమితి సభ్యులు నాసర్‌పాషా, నాయకులు సిల్వేరు గట్టయ్య, షేక్ అబ్దుల్ రవూఫ్, వి.వెంకటరత్నం, నంబూరి శ్రీనివాస్, ఎండి.షాబుద్దీన్, సారయ్య, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో చండీ హోమం జరిపించారు. సోమవారం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ హోమశాలలో అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చండీహోమం జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



దుమ్ముగూడెం: కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టిన యువత

దుమ్ముగూడెం: కోల్‌కత్తాలో పీజీ మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మండలంలోని సీతానగరం గ్రామంలోనిబ యువత డిమాండ్ చేశారు. కొవ్వొత్తులతో డాక్టర్ మృతికి సంఘీభావం తెలిపి వారు మాట్లాడారు. యువజన నాయకులు తెల్లం హరికృష్ణ, కాగితాల శివకుమార్, కొమరం నవీన్, కారం నవీన్, కొమరం గజేందర్, కుంజా రఘు, గొల్లపూడి గంగరాజు, మహిళలు సరోజినీ, అనూష, భార్గవి, తేజ, లావణ్య, ఇందు, హైమ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: పశ్చిమ బెంగాల్ లోని కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కే ఉమర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని కొండాయిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా మహిళా వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు.